24-3-50

ఏమీ తీసిపోలేదు. అయితే నారాయణరావు సృష్టించిన సందిగ్ధావస్థ, నాగేశ్వరరావు కల్పించలేదు. అందువల్ల శ్రీ లక్ష్మమ్మ కథలో సస్పెన్స్ తక్కువగా వున్నట్లు కనిపిస్తుంది.

మొత్తానికి రెండు చిత్రాలు విజయవంతమైన నిర్మాణమే. ఈ లక్ష్మమ్మ కథను ఇద్దరు నిర్మాతలు తయారు చెయ్యడంలో ఆరోగ్యకరమైన పోటీ కనిపిస్తుంది. నే నిదివరలో చెప్పినట్లుగా చిత్రాలు తక్కువ కాలంలో నిర్మింపబడడమే గాకుండా, సంఖ్య హెచ్చడమే గాకుండా, నాణ్యంకూడా హెచ్చుతుంది. ఈ కాశీ మజిలీ కథలన్నీ ఒక్కొక్క నిర్మాత చిత్రంగా తీసేకంటె, లక్ష్మమ్మ కథ వంటివి ఇద్దరేసి నిర్మాతలు పోటీ చిత్రాలుగా తీయడమే నయం. ఆ తప్పుకంటె యీతప్పు తక్కువది.

ఈ రోజుల్లో ఏ చిత్రానికైనా ప్రేక్షకులు తండోపతండాలుగా వస్తారు. ఒకే కథను ఇద్దరు నిర్మాతలు చిత్రాలుగా తీస్తే ఎవరో ఒకరు ఆర్థికంగా దెబ్బతింటారంటే, అలాగ, దెబ్బ తినకుండా, జాగ్రత్తగా ప్రజానురంజకంగా తీసే బాధ్యత ఆ నిర్మాతదే అయివుంటుంది. కాబట్టి చిత్రనిర్మాణంలో ఒకే కథను యిద్దరు నిర్మాతలు తీసుకున్నా, వేరువేరు కథా వస్తువులతో చిత్రాలు తీసినా ఒకరి నిర్మాణంకంటె మరొకరి నిర్మాణం ప్రజామోదంగా వుండటానికి ప్రయత్నించాలి. అప్పుడే మన చిత్రాలలో ఒక విశిష్టత ఏర్పడుతుంది. ఎక్కువ చిత్రాలు బాగుండడానికి అవకాశం ఏర్పడుతుంది.

సుబుద్ధి

# పిచ్చివాడి మరణం

## దండమూడి మహీధర కుమార్

అతను వెళ్ళాడు. ఒక్కసారి ఆమె చకితురాలైంది. మూర్తివత్ చలన రహితంగా అతని మొహంలోకి చూస్తూ వుండిపోయింది. అతనో? అతనూ అంతే! భావాలన్నిటినీ కళ్ళల్లో నింపుకొని ఆమెవేపు అల్లాగే చూస్తున్నాడు. రెండు సంవత్సరాలు అయ్యాక మొదటిసారిగా కల్పించిన తన చిన్నప్పటి స్నేహితుణ్ణి 'మధూ! ఎప్పుడొచ్చావ్? బాగున్నావా?' అని అడగదేం? అడగలేదు. ఆ శక్తి ఆమెలో నశించిపోయింది, ఒక్క గోపీకి మినహా మరెవ్వరికీ ఆమె హృదిలో స్థానంలేదు. అలాంటి స్థితిలో వచ్చిన మధును ఆమె ఏమని అడుగుతుంది, ఎలా అడుగుతుంది?

కనీసం అతనైనా 'శశీ! బావున్నావా?' అని అడగడేం? అడగలేదు. కాని ఏదో అడిగేందుకే వచ్చాడు. ఏమడగాలో అతనికి అర్థమవలేదు. అర్థం కాకపోటంవల్లనే అతను రెండు సంవత్సరాలు గడిచాక ఆమె పెళ్లి గోపీతో అయ్యాక కూడా ఆమె ద్వారంముందు నిలబడ్డాడు. ఎంత ధైర్యం? ఆమెకు పెళ్ళయింది. భర్తతో వుంటోంది. అలాంటి ఆమెను ఏదో అడిగేందుకు రావటం అతని సాహసాన్ని వ్యక్తం చేస్తోంది.

కళ్ళు నేలను చూస్తున్నాయి. అన్నాడు—'శశీ! నాకు తెలుసు, నా ఉత్తరం నిన్ను బాధపెట్టివుంటుంది. వాస్తవంగా నా అభిమతం నిన్ను ఏ రకంగానూ వ్యథను చెందేట్టు చేయటం కాదు. భాస్కరం ద్వారా నీవు పంపిన ఉత్తరం అలా ఎందుకు రాశావ్? చెప్పవే?'

ఆమె వెనుకటిలా మూస్తోంది. మాట్లాడలేదు. కనీసం ఒక్కమాటైనా అనదేం?' లేదు మధూ! నేను నిన్ను మరచిపోలే' నని. పోనీ 'మధూ! నిన్ను నేను వెనుకటిలా ప్రేమిస్తున్నా' నని అనకూడదూ? అలా అనలేదు- ఆమెలో నుంచి దీర్ఘంగా ఒక శ్వాస ఆవిరిగా బయటికి వచ్చి గాలిలో కలిసిపోయింది. అన్నది—"మధూ! ఇక్కడికెందుకు వచ్చావ్? నేను సుఖంగా జీవిస్తున్నానేమో చూచి నాలో చిచ్చు రగిల్చి వెళ్లేందుకేనా?" మధు ఒకడుగు ముందుకేశాడు- 'లేదు శశీ! నాలో నీవు రగిలించిన చిచ్చును నీ కెరుకపరిచేందుకు వచ్చాను. నీవు భాస్కరం



24-3-50

ద్వారా పంపిన ఉత్తరాన్ని ఆధారం చేసుకొని వచ్చాను!' వెంటనే ఆమె అన్నది- అయితే దానికి సమాధానం అలా ఎందుకు రాశావ్?- 'శశీ! నువ్వు నాకొకావాలి' అని! 'భాస్కరం ఉత్తరంలో 'మధూ!' నిన్ను నేను వెనకటిలా ప్రేమిస్తున్నానని రాసినందుకే' అన్నాడు అతను.

'మధూ!'

'శశీ!'

'నేను గోపీని మినహా మరెవరినీ ప్రేమించలేను'

'నేను నిన్ను మినహా మరెవరినిగూర్చీ ఆలోచించలేను.'

'నీవు ఘాతకుడివి.'

'నీవు ఒక హృదయంలో అగ్నిని ప్రజ్వరిల్ల జేసిందానివి!'

'నేను సుఖంగా వుంటం ఇష్టంలేదా?'

'నేను బ్రతుకు భారంలో క్రుంగి కృశించటమో?'

ఒక అడుగు ముందు కేసింది, ఆమె అన్నది. 'నన్ను నీవు అపార్థం చేసుకుంటున్నావు! నా జీవితం ధ్వంసం చేసేందుకు సిద్ధమయ్యావు! ఇలా నీవు గోపీలేని సమయంలో వచ్చి 'శశీ నీవు నాదానివి' అనటం నీ పశుత్వాన్ని వ్యక్తం చేస్తోంది. వెళ్ళిపో! నేను నిన్ను ప్రేమించటం లేదు, గోపీ వస్తాడు. నిన్ను చూసి అనుమానిస్తాడు. నాజీవితం నిందలకు పాలవుతుంది. గోపీ నన్ను అపార్థం చేసుకుంటాడు. అతను ఆఫీసునుంచిరాకముందే వెళ్ళిపో,వెళ్ళిపోమధూ!'

"........."

'అవును! ఒకప్పుడు నిన్ను నే ప్రేమించిన మాట వాస్తవమే! ఆ రోజులు వేరు. బాధ్యతలంటే ఏమిటో-పరిస్థితులంటే ఏమిటో తెలీని రోజులవి! ఇంకా నీవు ఆ వూహాజగత్తులో విహరించటం మానుకో! అందుకే భాస్కరం ఉత్తరంలో రాశాను-ఇప్పుడు మాత్రం నేనింకో రకంగా ప్రేమిస్తున్నాను 'ఒక స్నేహితుడిలా! ఒక సోదరుడిలా!! దాన్ని నీవు అర్థం చేసుకోలేదు."

అతను ఆమె కళ్ళకేసి చూసి అన్నాడు: 'ఒకచోట పెరిగాం. ఒకచోట చదువుకున్నాం. ఒకచోట ఆడుకున్నాం. ఇద్దరం ఒక్కటిగా ఎక్కడికెక్కడికో తిరిగి వచ్చాం. శరీరాలు వేరు, ఆత్మలు ఒకటి! నీవు నన్ను ప్రేమించావు. నేను నిన్ను ప్రేమించాను. దాన్ని ప్రేమ అనే పేరుతో పిలుస్తారని మనిద్దరిలో ఎవ్వరికీ తెలియదు. యౌవన వసంతాలు తొంగిచూచిన క్షణాల్లో ఒక యువతీ ఒక యువకుడూ పరస్పరంగా ఏర్పరుచుకునే భావాలనే మనం ఏర్పరుచుకున్నాం. అవును కదూ? చెప్పు! చెప్పవేం

"............"

'గోపీతో నీ పెళ్ళయింది. ఈరోజు నీవు 'మధూ! నిన్ను నేను ఒక స్నేహితుడిలా, ఒక సోదరునిలా, ఒకపురుషునిలా ప్రేమిస్తున్నా ననటము నిన్ను నీవు మోసగించుకోటమే అవుతుంది. ఈ మాటలతో నీవు ఇతరులను మభ్యపెట్టవచ్చు. నన్ను మభ్యపెట్టలేవు! లోకం దృష్టిలో నీవు పతివ్రతవు అనిపించుకోవాలని, నీ హృదయంలో నేనంటే వెనకటి ప్రేమ ఉన్నప్పటికీ నేను గోపినే ప్రేమిస్తున్నానని నీహృదయరాణి వ్యతిరేకంగా నీవే చెప్పుకోటం నీ బలహీనతే'-

శశీ! నన్ను నీవు విస్మరించలేవు! అలా అనుకోటం నీ పొరపాటు!"

అతను మాట్లాట్టం మానేశాడు. అతనిలో శక్తిలేదు. కంఠం రుద్ధమై పోయింది. కళ్లు మూతలు పడుతున్నాయి. వేడిగా ఉన్న తన ఫాలభాగాన్ని చేత్తో తడిమి చూసుకున్నాడు. అకస్మాత్తుగా అతని తలమీద బలమైన దెబ్బ తగిలింది. దభాలున ఆ మనిషి క్రింద పడిపోయాడు. మరో నిమిషాన తలుపులు మూసుకోబడ్డాయి.

బలమైన దెబ్బ మెదడుకు తగిలింది. శరీరం యావత్తూ రక్తసిక్తమై పోయింది.

* * *

ఓరోజు మధు వందలకొలది మైళ్లు పారిపోయాడు. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి. ఓరోజు నది ఒడ్డున కూచున్నాడు- 'నా జీవితం నిరాశామయం! దారి తెలీని ఈ అంధకారంలో నేను జీవించలేను. మధూ! అని ప్రేమతో పిలిచేవారులేరు - నా జీవితంలో! నేను బ్రతికి లాభం లేదు, చచ్చిపోతాను!' అనుకున్నాడు - నిండుగా ప్రవహించే నదీజలం వేపుకు చూస్తూ. వెంటనే అతని హృదయా

కాలంలో 'శశి' మెరిసింది. కొంతకాలంక్రితం భాస్కరం ద్వారా అందిన ఉత్తరం గుర్తొచ్చింది. ఆ క్షణంలోనే బయలుదేరాడు. 'నా జీవితంలో నన్ను ఒకే ఒకరు ప్రేమతో పలకరించగలరు-ఆవ్యక్తి ఒక్క శశి మాత్రమే' అనుకున్నాడు. ప్రయాణంలో 'శశి! తన్ను చూస్తుంది. నవ్వుతూ ఆహ్వానిస్తుంది. గోపీతో 'ఇతను నా చిన్ననాటి స్నేహితుడు మధు' అని చెబుతుంది. గోపీ-"మిమ్మల్ని కలుసుకున్నందుకు సంతోషం" అంటాడు. నాజీవితం ఆఖరుకాబోయే ముందు శశి పెదిమెలమీద తాండవించిన చిరునవ్వే నాకుతృప్తి! అదే నాఆఖరికోరిక-నే బయలుదేరబోయే ముందు నవ్వుతూ నిలబడిన జంటను చూచి-'మీదంపతులు కలకాలం సుఖంగా ఉండాలనికోరుకుంటున్నా' అని చెబుతాను. ఆరోజుతోనే నాజీవితం ఆఖరవుతుంది'-ఇలా ఎన్నో అనుకున్నాడు.

తినీ, తినక జీవిస్తూ బక్క-చిక్కిన శరీరంతో ఇక్కడికి వచ్చాడు. శశి పలకరించలేదు. అతని హృదయం చివుక్కుమంది. ఎన్ని రకాలుగా గాయ పరచటానికి వీలుంటుందో అన్ని రకాలుగా గాయపరచి - మరీ తను వెళ్ళిపోవాలని అనుకున్నాడు. అందుకే అన్ని అనరాని మాటలన్నాడు. ఆమెకు కోపంవచ్చి బలంగా కొట్టింది.

ఏమైనా శశిది స్త్రీ హృదయం. లోపలికెళ్లి వెక్కి-వెక్కి ఏడ్చింది. హృదయంలో ఎన్నెన్నో భావాలు లేచి ఘోష పెట్టినయి. దాంతో ఆమెకు శోషవచ్చి పడిపోయింది.

*　　*　　*

ఆఫీస్‌నుంచి గోపీ వచ్చాడు వాకిట్లో ఎవరో పడి వుంటం - చూచి ఆశ్చర్యపోయాడు. మరీ దగ్గరికొచ్చేప్పటికి సన్నని మూలుగు వినిపిస్తోంది. ఎవరు? ఇక్కడెందుకు పడివున్నాడో అర్థం కాలేదు. వంగి మొహంలోకి చూచేప్పటికి రక్తంతో తడిసివుంది. కళ్లుమూసుకొని వున్నాడు. క్రింద కూర్చొని 'ఎవరు నువ్వు?' అని అడిగాడు. నోరు కదిల్చాడు. మాటలకోసరం కాదు- నీటి కోసం! దప్పికయింది!! శరీరానికి కాదు అతని ఆత్మకు! అయితే గోపీ తెలుసుకోలేకపోయాడు. శశే అర్థం చేసుకోలేనప్పుడు అతనేం అర్థం చేసుకుంటాడు ?

గబగబా లేచి లోపలికి వెళ్ళాడు. శశి మంచం మీదబడి మూల్గుతోంది! గోపీకి అర్థం కాలేదు. ఒకరు బయటా ఆవిధంగా, మరొకరు లోపల ఈ విధంగా లోలోపల వ్యధను చెందటాన్ని గూర్చి అతనికి అవగతం కానే లేదు.

*　　*　　*

శశి సమాధానం చెప్పింది. అతనెవరో పిచ్చివాడనీ, ఎన్నటికీ తిరిగిరాని ఏదో వస్తువును వెదుక్కుంటూ ఇక్కడికొచ్చి, తన్ను క్రూరంగా చూశాడనీ ఆ కారణంవల్ల తను గాయపరిచినట్లూ- గోపీకి చెప్పగా గోపీ ఆ రక్తసిక్తంగా పడివున్న ఆ సన్నటి శరీరాన్ని లోనికి చేర్చి మంచంమీద పడుకోబెట్టాడు. డాక్టర్ కోసం బయటికి నడుస్తూ—తగిన సపర్యలు చేస్తూండమని చెప్పాడు.

గోపీ వచ్చేలోగా ఆ పిచ్చివాడు ఈ లోకాన్ని వదిలి ప్రశాంతంగా నిద్రించాడు.

---

ఒక అమెరికను దేశద్రిమ్మరి ప్రపంచంలో వింతలన్నీ చూస్తూ యిటలీ వెళ్ళాడు.

"ఇది పైసా వంకరగోపురం" అన్నాడు వింతలుచూపే ఆయన.

"ఏమిటి దీనిపేరు ?" అన్నాడు దేశద్రిమ్మరి మళ్లీ.

"దీన్ని వాలిపోయిన పైసాగోపురం అంటారు" అన్నాడు.

"ఏమిటో, వెధవపేరు, నాకు నోరు తిరగడం లేదు. దీన్ని చూస్తూంటే మా యిల్లు కట్టిన కంట్రాక్టరే దీన్ని కట్టివుంటాడనిపిస్తోంది." అన్నాడు అమెరికను.